క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న భూషణం మాస్టారు

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జూ పార్కు అధికారి మంగమ్మ అన్నారు. పర్యావరణ ప్రేమికుడు ఎన్‌ఏడీ బుచ్చిరాజుపాలేనికి చెందిన భూషణం మాస్టారు ఆధ్వర్యంలో శనివారం జూ పార్కులో నేరేడు మొక్కలు నాటారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న భూషణం మాస్టారును జూ పార్కు అధికారులు అభినందించారు.

కూలిన చెట్టు



కొత్తపాలెం జంక్షన్‌లో కూలిన చెట్టు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జంక్షన్ వద్ద నీడనిచ్చిన చెట్టు శనివారం ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. స్థానికులు, జీవీఎంసీ అధికారుల చొరవతో చెట్టును తొలగించారు.

లా విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార: ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని క్రైం ఏసీపీ వెంకటరావు సూచించారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎన్‌బీఎం లా కళాశాలలో విద్యార్థులకు శనివారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి మారిన సెక్షన్ల గురించి వివరించారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత(బీఎన్, ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అభినయం, బాధితుల హక్కుల పరిరక్షణకు చేర్చబడిన కొత్త చట్టాలపై వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, చైన్ స్నేచింగ్, మొబైల్ దొంగతనాలు, వాహనాల చోరీలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.రమణ, ఎస్.రాజు, ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ భాస్కరరావు, ఎస్.రాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో శిబిరాన్ని నిర్వహిస్తారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు, ఔషధాలను సూచిస్తారు. ఇతర వివరాలకు డాక్టర్ కె.ఈశ్వర రావును 9440191673 నంబరులో సంప్రదించవచ్చును.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

విశాఖ విద్య: పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేసే ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో శనివారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. 89,90,91,92 వార్డు పరిధిలోని పలు కాలనీల నుంచి తీసుకొచ్చిన 498 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను డాక్టర్ ఎ. రవికుమార్ ఆధ్వర్యంలోని వైద్య బృందం వేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయ పశువైద్యశాల సమీపంలోనే ఉన్నందున పెంపుడు జంతువులను పెంచే వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ జూనోసిస్ డే

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం ప్రభుత్వ పశువుల ఆస్పత్రి ఆవరణలో శనివారం వరల్డ్ జూనోసిస్ డేను పురస్కరించుకుని డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా అందజేశారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు ఆర్ ఆర్ రాజు మాట్లాడుతూ చాలా మంది అవగాహన లోపంతో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న అన్ని రకాల పశువులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. జూనోసిస్ డే ను పురస్కరించుకుని సుమారు 200 కుక్కలకు టీకాలు వేసినట్లు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తాతబాబు, సురేష్, రామారావు, శంకర్, మున్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ సునీల్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సామాజిక భవన నిర్మాణ పనుల పరిశీలన

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు అల్లూరిసీతారామరాజుకాలనీలో జరుగుతున్న సామాజిక భవన నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తి చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇప్పటికే రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు జీవన్, ప్రభాకర్, రామకృష్ణ, పరశురామ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



62వ వార్డులో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: సమాజంలోని అసమానతలను తొలగించడానికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అమోఘమని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ భారతీయుల హక్కుల కోసం జగ్జీవన్ రామ్ చేసిన అనేక ఉద్యమాలను చేశారన్నారు. దేశ తొలి ఉపప్రధానిగా ఆయన చేసిన సేవాకార్యక్రమాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సింథియా: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జిమాలి నాయుడు అన్నారు. త్రినాధపురంలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా యూసీడీ సీవో భాను ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలంతా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, సచివాలయ మహిళా పోలీస్ సునీత, ఆశకార్యకర్తలు ,మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లలితా పీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితా నగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం వారాహిదేవికి సహస్ర నామార్చన చేశారు. అమ్మవారిని అలంకరించి దూప దీప నైవేద్యం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహిదేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. ఈ నెల 10న శుద్ధ పంచమి సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



వారాహి దేవి

సాంకేతికతతో ముందంజ

పెందుర్తి: ప్రస్తుతం సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరిచిన వారు ముందంజ వేస్తున్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో 'మనిషి దైనందిత జీవనంలో సైన్స్ టెక్నాలజీ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో దివ్య కీర్తి మొదటిస్థానంలో, ద్వితీయ స్థానంలో ఎస్. జశ్వంత్, బి.యామిని , తృతీయస్థానంలో ఎస్‌వీఎస్ తరుణ్‌కుమార్, పి.అఖిల్ ఆదిత్య, కె.శేఖర్ నిలిచారు. అతిథిగా నేవల్ డాక్‌యార్డ్ అధికారి జి.వరప్రసాద్ వచ్చారు. న్యాయ నిర్ణేతలుగా గోపాలరావు, శ్రీకాంత్ వ్యవహరించారు. సిబ్బంది ఎం.వి రమణ, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజేతలు విజయనగరం, హనీ గ్రూప్



ఇన్‌స్టిట్యూషనల్ విజేత హనీ గ్రూప్ జట్టు



డివిజన్ లీగ్ విజేత విజయనగరం జట్టు

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రికెట్ సంఘం వార్షిక డివిజన్ లీగ్ పోటీల్లో విజయనగరం, గెలాక్సీ జట్లతోపాటు డివిజన్ల, ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతలు ట్రోఫీలందుకున్నారు. శనివారం నిర్వహించిన వార్షిక బహుమతి ప్రదానోత్సవంలో తొలి డివిజన్ విజేతగా విజయనగరం జిల్లా జట్టు నిలవగా, రన్నరప్‌గా గెలాక్సీ సీసీ నిలిచింది. రెండో డివిజన్‌లో ఈకోర్సా, కౌంటీ సీసీ జట్లు, మూడో డివిజన్‌లో స్టీల్‌ప్లాంట్, సోలోస్ జట్లు, నాలుగో డివిజన్‌లో ఉషోదయ సీసీ, మూన్ స్టార్స్ జట్లు, ఐదో డివిజన్‌లో రైజింగ్ బ్లూస్, యూసీసీ జట్లు, ఆరో డివిజన్‌లో వాల్తేర్ నైట్స్, లెజెండ్స్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇన్‌స్టిట్యూషన్ లీగ్‌లో హనీ గ్రూప్, సిటీ పోలీస్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. స్థాయి ఆధారంగా ఆరు డివిజన్లుగా పోటీలు నిర్వహించగా తొలి డివిజన్‌లో తపస్వి బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా, మనీష్ బెస్ట్ బౌలర్‌గా, ఎస్‌వీ రాహుల్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారు. ఈశ్వర్, చరణ్, సుమీత్ రెండో డివిజన్‌లో, యశస్వి, శ్రీనివాస్, సతీష్ మూడో డివిజన్‌లో, రాజు, నాగార్జున, అనిల్‌కుమార్ నాలుగో డివిజన్‌లో బెస్ట్‌గా నిలిచారు. సతీష్, హరీష్, హేమంత్ ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బెస్ట్‌గా నిలిచారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, కార్యదర్శి పార్థసారథి బహుమతి ప్రదానం చేయగా సంఘం ప్రతినిధులు సుధాకర్, టీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ ప్రసాద్, జేకేఎం రాజు, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో జగ్జీవన్‌రామ్ చైర్ ఏర్పాటు చేయండి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ పరిశోధకులు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సభ్యులు కోరారు. శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా న్యూఢిల్లీలోని సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫౌండేషన్‌కు సైతం లేఖ రాశారు. 1973లో ఏయూ గౌరవ డాక్టరేట్‌ను సైతం అందించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి వాటిని పరిష్కరించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు గౌరీ నగర్ ఏరియాలో జీవీఎంసీ అధికారులు, సిబ్బందితో కలసి శనివారం పర్యటించారు. నిర్మాణంలో ఉన్న వార్డు పారిశుధ్య కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. గౌరీ నగర్‌పార్కును సందర్శించి, మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఎలాంటి పనులు చేపట్టాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. కాలనీలోని స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బంది ప్రతీ రోజూ అందుబాటులో ఉండి పనులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వాటర్ సప్లై ఏఈ ఇమ్మానుయల్, ఇంజినీరింగ్ ఏఈ ఉష, హార్టికల్చర్ విభాగం ఏవో అర్చన,వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, మూర్తి, సన్యాసి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదువులు చెప్పాలని విద్యాశాఖ ఆర్జేడీ బి. విజయ భాస్కర్ అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులకు శనివారం వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ విజయ భాస్కర్ మాట్లాడుతూ గణితం అంటే విద్యార్థుల్లో లేనిపోని భయం ఉందని, ఇదో కష్టమైన సబ్జెక్టుగా భావిస్తున్నారన్నారు. కానీ సబ్జెక్టులో పట్టుసాధిస్తే..గణితమే సులభమన్నారు. దీనిలోనే ఎక్కువ మార్కులు కూడా సాధించవచ్చన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించి బోధనలో మెలకువలను తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల తరఫున ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్ఎం వై. వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి విస్తృత సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్ ప్రశంసించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం వాకర్స్ పార్కులో క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడూతూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ఈ క్లబ్ ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ జూలై నెల సంచికను ఆయన ఆవిష్కరించారు. 91వ వసంతంలోకి అడుగు పెట్టిన క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, ఈ ఏడాది 90వ వసంతంలోకి అడుగు పెడుతున్న పూర్వ అధ్యక్షులు కేజీ కృష్ణారావు, రాళ్లపల్లి సత్యనాథం చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులకు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవన నిర్మాణానికి తొలిసారిగా వాకర్స్ క్లబ్ సభ్యుల తరపున లక్ష రూపాయల విరాళాన్ని అందించినట్లు చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులకు వాకర్స్ నియమావళి తెలియచేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కమల్ బైద్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లు సభ్యులకు పంపిణీ చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, పూర్వాధ్యక్షులు సిహెచ్.కృష్ణమూర్తి, ఎం .భాస్కరరావు, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం .రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, వి.అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, వై.దేముడు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.రామ్మోహనరావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి, ఓం వాకర్స్ అధ్యక్షురాలు వి.ప్రమీల పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ సభ్యులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న కమల్ బైద్

తల్లి పేరుతో మొక్కను నాటండి

ఏయూక్యాంపస్: ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఏక్ పేడ్ మాతాకే నామ్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఏయూలో జాతీయ సేవా పథకం అధికారులు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ జాతీయ సేవ పథకం ప్రతి యూనిట్ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. మొక్కల వలన ప్రాణవాయువు లభిస్తుందని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ప్రతీ వ్యక్తి తల్లిరుణం తీర్చుకోవాలని భావిస్తారని, అలా భావించే వారంతా తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. తల్లి మనకు ప్రాణం ఇస్తుందని, దీనిని రక్షిస్తూ మనకు నిత్యం ప్రాణవాయువును మొక్కలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ అర్చన, వై.అనసూయా దేవి, జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు మొక్కలు నాటి ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మొక్క నాటిన ఎన్ఎస్ఎస్ సిబ్బంది